
# శ్రద్ధ



రచన : సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్



సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ బోధ

ప్రధమ ముద్రణ: 2023
ప్రాప్తి స్థానము: శ్రీసాయి మాస్టర్ సేవా ట్రస్ట్
గొలగమూడి (పోస్టు)
నెల్లూరు జిల్లా
ఆంధ్రప్రదేశ్
524321

Visit http://www.saimastersevatrust.org/

# ముందు మాట

శ్రీ సుబ్బరామయ్య సార్ (సార్) సహజంగా స్వామిని, తనను ఆశ్రయించిన వారితో చేసిన సంభాషణలు, సత్సంగంలో పంచిన విషయాలనే సార్ స్పీచ్ లు గా రికార్డు చేసుకోవడం జరిగింది. శ్రీ సార్ వద్దకు ఎంతో ఆర్తి, అవసరము, సందేహాలు, చిక్కు సమస్యలతోనూ, ఆచరణలో కలిగిన ఇబ్బందులు విన్నవించుకోవడం, వాటిని అధిగమించడం కోసము వారి సన్నిధికి చేరి, ఎదురుచూసే భక్తులకు శ్రీ సుబ్బరామయ్య సార్ నోట వెలువడే మాటలు, సత్సంగము  దివ్య ఔషధాలుగా, మార్గదర్శకంగా, భక్తి-జ్ఞాన-కర్మ- ధర్మ దీప కణికలుగా వెలువరించేవి.

ఎందరో జీవన మార్గాలను నిర్దేశించి, ఉత్తమ జీవనాలలో అడుగుపెట్టుటకు, మరియు చిక్కు సమస్యల నుండి బయటపడి తృప్తి-శాంతులు సాధించుటకు తగిన ఆనంద జీవనంలో అడిగిడుటకు  శ్రీ సార్ సాంగత్యము, నిష్కపటమైన- తేటతెల్లమైన-చురకలు వేసే శ్రీ సార్ మాటలు ప్రత్యక్ష దీప శిఖలుగా నిలిచాయి, నిలుస్తున్నాయి.

**శ్రీ సుబ్బరామయ్య సార్ ఒకరోజు సత్సంగం చేస్తూ స్వయంగా ఈ చెప్పే విషయాన్ని రికార్డు చేసి ప్రింట్ వేయించమన్నారు. ఇప్పుడు ఆ ప్రవచనాన్ని టైపు చేసి ముద్రిస్తున్నాము.**

స్వామి వారితో **"నన్ను సాధన చేసుకుంటూ ఎచ్చట ఉండమంటారు?"** అన్న భక్తునితో  **"ఎక్కడైనా ఒక్క దూలపు ఇల్లు వేసుకొని ఉండవచ్చు"** అని శ్రీ స్వామివారు సెలవిచ్చారు.  శ్రీ సార్ ఈ సత్సంగం ద్వారా అందించిన "స్వామి సేవకుల విశ్వాసంలో తారతమ్యాలను" గూర్చిన విశ్లేషణ పై స్వామి సూక్తికి విశేష వివరణ.

శ్రీ సార్ ఈ సత్సంగంలో స్వామిని ఎందరో సేవకులు ఆశ్రయించినా, వారి విశ్వాసము-శరణాగతులలోని తరతర భేదాలను అనుసరించి, ప్రాకృతికమైన బలహీనతలు, ఇష్ట-అయిష్టాలు, వ్యామోహాలను, భయాలను స్వామి సన్నిధిలో ఆహుతి చేసుకొనటంలో  తారతమ్యాలను అనుసరించి, స్వామి అనుగ్రహం-

అనుభవం కావటంలో వ్యత్యాసాన్ని తెలుపుతూ, శ్రీ స్వామిని ఆశ్రయించే విధానము మనందరికీ విశదం చేశారు.

ఎంతటి శ్రద్ధ, జాగ్రత్తలతో శ్రీ స్వామివారి వంటి మహాత్ముల సన్నిధిని సద్వినియోగం చేసుకునటలో ఎరుక వహించాలో హెచ్చరిస్తూ "Laser బ్లేడ్ తో కోసినట్లు ఉంటాయి మహాత్ముల వాక్యాలు " అన్న శ్రీ మాస్టారు మాటకు వివరణగా శ్రీ సార్ విశ్లేషణ సాగుతుంది. "ఒంటి దూలపు ఇల్లు వేసుకొని ఉండమన్న" శ్రీ స్వామి సూక్తి కి వివరణగా స్వామి వారే ఏకైక ఆధారంగా బాహ్య అంతరముల యందు విశ్వసించి ఉండడం అంటే ఏమో, విశ్వసించ లేకపోవడం ఎలా ఉంటుందో తెలుపుతున్నారు.

శ్రీ స్వామి ని సంపూర్ణ శరణాగతి చేసిన సేవకులు శ్రీ రోసి రెడ్డి గారు, శ్రీ కొమరగిరి రమణయ్య గారు, మాతాజీ వక్కమ్మ, మాతాజీ తులసమ్మ మొ|| వారు మరు పూటకు ఆలోచించకుండా జీవించటం ఎలా సహజము చేసుకోగలిగారో, మరణ భయము సైతము దాటే అభయాన్ని ఎలా స్వామి సన్నిధి, సేవలో సాధించారో ఈ సార్ స్పీచ్ తెలుపుతుంది.

స్వామి సన్నిధి పుస్తకంలో స్వామి సేవకులు శ్రీ స్వామిని ఎంతటి దివ్యగుణాలతో ఆశ్రయించి సేవించారో తెలిపిన శ్రీ సార్, ఆ పుస్తక అనుబంధంగా నరసమ్మ గారు, బరిగెల నాగయ్య గారు కుడా ఎంతటి ఔన్నత్యంతో స్వామిని సేవించారో వివరించిన శ్రీ సార్, శ్రీ స్వామి సేవకుల నుండి ఎలా జీవిత పాఠాలు నేర్చుకోవాలో, మన శరణాగతి ని, విశ్వాసాన్ని ధృడతరం చేసుకోవటంలో లోటు పాట్లలను గుర్తిస్తూ స్వామి సన్నిధిని లో ఉండవలసిన అప్రమత్తత ఎలా ఉంటుందో ఈ స్పీచ్ ద్వారా అనుభవింప చేస్తున్నారు.

**కర్మణా మనసా వాచా సర్వదారాధయేద్గురుం**
**దీర్ఘ దండం నమస్కృత్య నిర్లజ్జో గురు సన్నిధౌ**

# శ్రద్ధ

నేను చెప్పినానే నాగయ్యకు వైట్ డ్రెస్ అంటే ఎంత ప్రీతో. అది చావలేదు ఆయనకు. ఏదో ఒక క్రూకేడ్ వ్యూతో అది తీసుకొచ్చి పెడద్దన్న మాట . ఆయన ఏమంటాడు, ఎందుకన్నా నీకీ పట్టు పంచలు ఇవన్నీ నీకు అని అడిగితే స్వామి సేవకులు అందరూ వెధవ గుడ్డలు కట్టుకుంటే ఆయనకు అవమానం కదా! ఆయనకు ఏమి అవమానం గోచీ గుడ్డలు పెట్టుకున్న ఆయనకు? ఆయనకు అవమానము అంట! అట్లా అయితే పట్టు పంచలు కావాలంటే ఎట్లా వస్తాయి నీకు? ఎవరైనా ఇస్తేనే కదా! అవి కట్టుకున్న తర్వాత ఇస్త్రీ చేయటానికి తేరగా చేసి ఇస్తారా చాకలి వాళ్ళు? ఆయనకే జీతం లేదు. టెంకాయ కొట్టాలంటే ఎక్కడైనా అప్పు తెచ్చుకొని కొట్టాల్సిందే! అందుకని వీటిని చాకలి వాళ్లకి వేయను, వాళ్ళు తోమను, వాటన్నింటికీ డబ్బులు కావాలి. డబ్బులు కావాలంటే చెయ్యి పట్టాలా! పట్టద్దా? జీతం లేదు, పాడు లేదు. బుజ్జయ్య చచ్చిపోయిన దాకా ఆయనకు జీతం లే! నీవు తింటున్నావు కదా, తిను! ఆస్పత్రికి పోవాలంటే డబ్బులు ఇస్తాము. ఇంకేం కావాలి నీకు! గుడ్డలకు మా గుడ్డలతో పాటు వెయ్యి, ఆశ్రమం క్రింద చాకలి వాళ్లకి మేమే ఇచ్చేస్తాము. చాకలి వాళ్లకు మేమే ఇచ్చేస్తాము అంటే మామూలు గుడ్డలయితే వాళ్ళు ఉతుకుతారు, ఎత్తుకుంటారు. నువ్వు ఏడ ఏడ ఉండే పట్టు పంచెలు తీసుకొచ్చి ఇస్తే వాళ్ళు చేసి ఇస్తారా తేరగా? అందుకని డబ్బులు తీసుకుంటుండేది ఆయన. చెప్తా ఆయన అట్లా చచ్చాడు. చచ్చేటప్పటికి చేసేదెవరు? మంచాన ఒక రెండేళ్లు ఉన్నాడు. కాలికి గిలక మీద ఏదో లేచింది. అది కురుపు పెద్దది అయింది. సరే కర్మ పోగొట్టాలి అనుకున్నాడు. ఆయన పోగొట్టగలడు స్వామి. పోగొట్టలా! ఇది పెద్దది అయిపోయింది. అప్పుడప్పుడు ఆసుపత్రికి పోవాలా, బ్యాండేజ్ వేయించాలా, ఇంజెక్షన్ వేయించాలా, మందులు పడాలా ఈయనేమో కదలలేక ఇంట్లోనే ఉంటే చేయొద్దా అన్నీ! ఆఖరికి దొడ్డికకి పోవాలన్నా ఆడనే పోవాలా! అందరూ ఎట్లా చస్తారో ఏమో మనకు తెలియదు అనుకో, నాకు మాత్రం ఒప్పలా! నీకు లెట్రిన్ సీటే కదా అక్కడ ఉండేది. అవతల పక్కన ఏంటంటే రెండు అడుగుల డయా ఉండే తొట్టిని దిగేస్తే దాని మీద మూత వేసేస్తారు. ఎవరికీ వాసన రాదు. కూర్చొని ఉంటుంది.

# శ్రద్ధ

కళ్ళు ఆపరేషన్ చేయించుకున్నాడు అక్కిం వెంకట్రామ రెడ్డి. ఆయన నడవకూడదు. కన్ను ఆపరేషన్ చేసినాడు కాబట్టి. ఇంట్లో వాళ్లు ఎప్పుడెప్పుడు పోతే శని వదలిపోతుందని వాళ్ళు పట్టించుకోలా! PRK ప్రసాద్ భార్య తీసుకొచ్చి చేయించింది అమెరికన్ ఆస్పత్రిలో. ఆమె ఏంటంటే ఆస్పత్రిలో ఉండిస్తే చూడొచ్చు అనుకున్నది. ఆమెకి తెలిసి కాదు. ఏదో ఆపరేషన్ చేసేస్తే అయిపోయిద్దిలే అనుకున్నది కానీ ఆపరేషన్ చేసిన తర్వాత ఆ మనిషి యొక్క పరిస్థితి ఎట్లా ఉంటుంది, అన్నిరోజులు మనం చేయగలమా లేదా అని ఆలోచించలా! ఆపరేషన్ చేయించేసింది. రెండురోజులు వచ్చింది మూడోరోజు రాకుండా మానేసింది. మరి ఆయనకు కూడు? ఆ ఆస్పత్రి వాళ్ళు పెడతారా? అమెరికన్ ఆస్పత్రిలో పెట్టరు వాళ్ళు అన్నం. మన అన్నమే! సరే స్వామి ఎట్లనో ఆయన చేసిన పుణ్యం బాగుండి ఒక పోలీసోడు తగులుకున్నాడు. మన బ్రహ్మం గారి రోడ్డున పోతుంటే ఎలిమెంటరీ స్కూల్ హెడ్ మాస్టర్ ఇల్లు ఉంది. ఆయన ఇంటి ప్రక్కనే ఈయన ఇల్లు. పోలీస్ ఆఫీసర్ ఇల్లు. ఇప్పుడు రిటైర్ అయినాడు. ఈయన వచ్చినాడు ఆడికి. అంటే ఈయనకు వెంకయ్య స్వామితో పరిచయం. అప్పుడు ఈ **అక్కిం వెంకట రామి రెడ్డిని** చూసాడు. స్వామీ! మీరు మా యింటికి రండి. ఇక్కడెందుకు ఉండటం. నేను తీసుకు పోయి అన్నీ చేస్తాము అని తీసుకు పోయినాడు పాపం వాళ్ళింటికి. ఈమె ఏంటంటే వాళ్ళింటికి వచ్చి చూసింది అంతే PRK ప్రసాద్ భార్య. ఎవరైనా దొడ్డిక పోతే ఎత్తి పోయాలంటే, లెట్రిన్ అయితే అది వేరే, లెట్రిన్ లో కూర్చుంటే నీళ్లు పోసేస్తే పోతుంది. ఇది అది కాదే! ఏదో మట్టో మశానమో తీసుకొచ్చి దాని నెత్తిన వేయాలి. ఆమైన చీపురు కట్టి చిమ్మాలా, ఈ చాట మళ్ళీ కడుక్కోవాలా! ఆ పరిస్థితి ఏందీ? ఆ పైన చూస్తే వాళ్ళింట్లో వాళ్ళు ఆయన్ను విసుక్కుంటున్నారు. వెళ్ళిపోమనలేదు. ఎందుకంటే ఈ పోలీస్ చండశాసనుడు. అట్లాంటి పరిస్థితిలో నేను గొలగమూడి పోతాను, అన్నాడు ఈయన. నేను గొలగమూడి పోతాను, గొలగమూడి పోతాను!! ఇకన సరేనని ఆమైన తీసుకు వచ్చి ఇక్కడ వదిలినారు. ఇక్కడ వదిలితే ఆయన ఆశ్రమానికి పోవాల! తీరా చూస్తే ఆయన ఆశ్రమం పోలేదు. మా వాకిటి ముందుకు వచ్చినాడు. అక్కడ కదా మా ఇల్లు. ఆడికి వచ్చినాడు. వచ్చి ఆ వరండాలో కూర్చున్నాడు. నేను అప్పుడప్పుడు మా ఆవిడకి చెప్తుండేది ఇలా ఆపరేషన్ జరిగిందని, ఇట్ట ఇట్టని. అమ్మా! ఉన్నాడా

సుబ్బరామయ్య? నేనిక్కడ కూర్చోవాలేనే! అక్కడ కూర్చో తాత నిన్ను ఎవరు వద్దు అంటారు? అహా! నేను ఎప్పుడూ ఈడనే కూర్చుని ఉండాలా ఎప్పుడూ! నువ్వు ఎప్పుడూ ఆడనే ఉండు తాత! నిన్ను ఎవ్వరూ ఏమనరు. సరే వచ్చాడు. ఆడ కూర్చుని ఉంటే దొడ్డికకు పోవాలా! దొడ్డికకు పోవాలంటే ఎట్లా? ఆయన ఉండ్లా పరంధామయ్య! పరంధామయ్య ఉండేవాడు ఇక్కడ. పరంధామయ్య ఈయనను భుజాన ఎక్కించుకుని అట్టా తీసుకు వెళ్లి మరలా తీసుకు వచ్చేవాడు. ఓరి నీయమ్మా భడవా! కన్నే కదలకూడదు రామచంద్రా అని వాళ్ళు చెప్తుంటే భుజం మీద ఎక్కించుకుని ఆడ ఇరగదోసి ఈడ ఇరగదోసి ఏంది గొడవ? ఆయన ఎప్పుడూ కూర్చునే ఉంటాడా తాత దగ్గర? పిల్లను పంపించాలా! ఏడ చిక్కుతాడు! వెతకాల! వెతికే లోపల దొడ్డికి పోవల్సి ఉంది. ఇక ఎందుకని మా వరండా ఉంటే మా వరండాలో సీటు బిగించినా! ఇప్పుడు గుమ్మం ప్రక్కన గోడ ఉండ్లా, ఆ గోడ ప్రక్కన అక్కడ పెద్ద కిటికీ ఉంది. కిటికీ పెట్టి ఉంటే నా లోపల కాబట్టి ఎవడూ ఏం objection చేయడు. నేనే త్రవ్వి పారనూకి ఆ గోడ అవతల 3 అడుగుల స్థలం ఉంది. దాంట్లో నడుం పైదాకా త్రవ్వినా! నేనే త్రవ్వా, కూలోడు లే! కుడితి తొట్టెలు అని పెడుతుంటారు. రెండు బిందెలు పట్టే తొట్లు ఉంటాయి. అది తొట్టి తెప్పించినా! ఆ తొట్టికి రంధ్రం పెట్టి బోర్లా వేసేసిన! ఈ సీట్లోంచి ఆ తొట్టిలోకి కనెక్షన్ పెట్టినా ఒక పైప్. ఒక బెల్ పైప్ పెట్టేస్తే ఆడ, ఇక్కడ ఒక బెల్ పైప్ పెట్టేస్తే వచ్చేస్తది అనమాట! సీట్లో నీళ్లు పోస్తే దాంట్లోకి దిగిపోద్ది. అక్కడ ఏమీ కనిపించదు. మన గోడ వెంబడే ఆ పైప్ మాత్రం పోయుంటుంది దాంట్లోకి. అదీ త్రవ్వి చూస్తేనే ఎవడికైనా! త్రవ్వకుండా తల దించుకోకుండా వెళ్ళేవాడికి ఏమీ కనపడదు.

అట్లనే నాగయ్యకు చెప్పినా. మేము చేయిస్తామంటే ఒప్పుకోలా. **వద్దులే సుబ్బరామయ్య! నువ్వెళ్ళి అడిగితే ఒప్పుకోరు** అన్నాడు. నీ ఖర్మ! ఒప్పుకుంటారో లేదో, నేను వచ్చి నిన్ను అడిగినా నా ఇబ్బంది ఇట్లా ఉందని, వాళ్ళు నీ దగ్గరకు వచ్చి అడుగుతారు. కావాలయ్యా! అవసరం ఉందని ఒక కూత కూస్తే పోలా! అది వద్దు అంటివి! మరి ఇప్పుడు చిమ్మి పోయాలా ఆమె! నీకు చేసేదానికి ఎట్టా అనే క్వశ్చన్ వచ్చింది కదా! చేసేదానికి మనిషి ఎవరు మంచాన పడితే అని క్వశ్చన్ వచ్చింది నీకు! ఆమె గంగమ్మ చేసింది. గంగమ్మ అనే ఆమె ఇప్పటికీ ఉంది. ఇప్పటికీ ఇట్లా ఇట్లా తలకాయ ఊగుతూ ఉంటుంది. ఆమె చేత

చేయించుకున్నాడు. 5 సవర్ల బంగారం చేయించినాడు. ఎట్లా వచ్చింది? నీ అబ్బ సంపాదించి ఇచ్చినాడా 5 సవర్ల బంగారం? నాగయ్య నాయన తెచ్చి ఇచ్చినాడంటయ్యా ఆయనకి? మూడు వేలో ఎంతో ఉంది బ్యాంకులో డబ్బు. అప్పుడు బ్యాంకు లేదు పోస్ట్ ఆఫీస్ ఉంది. నీ దుంప తెగ అది ఆమె పేరుతో వేసి ఉంటే పోను, అది ఈయన పేరుతో వేసుకున్నాడు. కమిటీకి ఈయన వచ్చి ఉన్నాడు బాలసుబ్రహ్మణ్యం. బాలసుబ్రహ్మణ్యం వచ్చి ట్రంకు పెట్టె తాళాలు వేసేసి ఉండయి. ఆయన చచ్చి పోయినాడు అని తెలిసింది. ఆ రూమ్ తాళం వేసేసి ఉంది. ఈమేమో గంగమ్మ లోపలకి పోవటానికి లే! 5 సవర్ల బంగారు లోపల ఉంది. పోస్ట్ ఆఫీస్ పాస్ బుక్ ఆడ ఉండే! మళ్ళీ ఆయనను ఖననం చేసేసిన తర్వాత అప్పుడు అయ్యవారు (బాలసుబ్రహ్మణ్యం) వచ్చి తాళం తీసి ఆ పెట్టె తాళం పగులగొట్టమన్నాడు. తాళం పగులగొడితే దానిలో నగలు ఉన్నాయి. ఈమె అవి నావే అంటది. నీకేడవి నగలు? ఆమె పేరుతోనే పోస్ట్ ఆఫీస్ లో డబ్బులు వేసేసి , ఈ డబ్బు, నగలు హుండీలో వేయించినాడు.

రోశిరెడ్డికి నేను మంచాన పడితే ఎట్లా అనేది రాలా! ఆయనకు మనసులో ఎప్పుడూ. రెండు మూడు సార్లు భార్య వచ్చినా కూడా ఆయన పలకలేదు. "సుబ్బరామయ్యా! ఈయాల వచ్చింది జంగమ్మ" అనేవాడు. ఎవరు తాత అంటే ఆమే, వీడింకా చచ్చినాడా లేదా తాళిబొట్టు తీయాలనా లేదా అని చూడడానికి వచ్చింది. ఈయన ఇక్కడ చావందే తాళిబొట్టు ఎందుకు తీసుకుంటుంది. ఒక్క చిన్న డబ్బు ఉంచాడు ఆయన దగ్గర. అప్పుడొక రూపాయ్ అప్పుడొక రూపాయ్ వెంకయ్యస్వామి ఇస్తే ఈ రూపాయలు పాతగుడ్డలో మూట గట్టి తలక్రింద పెట్టుకోనుంటాడు. అవి పది రూపాయలు అయ్యిందంటే ఆ పది రూపాయలు పాలామె చేతికిచ్చి పొగాకు తెప్పిస్తాడు. ఆ పొగాకు స్వామికి ఇచ్చేస్తాడు. స్వామి ఆ పొగాకు నమిలి ఊస్తే అది ఎత్తి నోట్లో వేసుకుంటాడు ఈయన. అది మొగోడితనం. అందుకనే కళ్ళు బొత్తిగా కనపడకుంటే ఆయనే చూపించినాడు భిక్షాన్నానికి పోవాలన్నా చూపించినాడు. కళ్ళు కనపడకుంటే ఇట్లా ఇట్లా తడుముకుంటా నాయనా అమ్మా (ఎవరో) వచ్చి తీసుకుని పోలా ఊళ్లోకి. పోవాలా అని భిక్షాపాత్ర చేతికి తీసుకున్నాడంటే అప్పుడు వస్తుందట చూపు. అప్పటి దాకా ఎట్లా పోతుందయ్యా! మళ్లా ఆడ నుండి వచ్చి కర్ర ప్రక్కన పెట్టి

స్వామికి దండం పెట్టాడంటే అప్పుడు (కంటి చూపు) పోతుంది. మళ్ళా తవుడుకు రావటమే! చిట్ట చివర వరకు ఇట్టనే సేవ చేసాడు. ఏమో తిరగకూడదు అనుకున్నాడు, మాట్లాడకూడదు అనుకున్నాడు ఎప్పుడూ మౌనం, మౌనం! స్వామి, స్వామి, స్వామి, స్వామి, స్వామి అంటుంటాడు. మూడు గంటలప్పుడు పిలిచినాడు. (బరిగల) నాగయ్యను తీసుకురండి అన్నాడు. నాగయ్య వచ్చినాడు. లేపితే లేస్తాడు, కూర్చొన పెడితే కూర్చుంటాడు. లేపిన తర్వాత నడుస్తాడు కొంత దూరం. ఆడ నుండి స్నానం చేసినాడు మరలా వచ్చినాడు. వాళ్ళు ఉతికిన గుడ్డలు అవీ ఇస్తారు. ఆ ఉతికిన గుడ్డలు కట్టుకున్నాడు. ఈయన స్నానం చేస్తున్నాడని తెలుస్తుండగానే నరసమ్మ నీళ్లలో చక్కర కలుపుకుని వస్తది వేడినీళ్లలో. ఆ అమ్మా! నువ్వా! అక్కడ పెట్టు మరలా త్రాగుతా! అన్నాడు. గిన్నె అక్కడ పెట్టేసి మూత పెట్టేసి పోయింది ఈమె. ఈయన ఆడ కూర్చున్నాడు. ఏందో గొడవ ఆయన గొడవ ఆయన చెప్పుకుంటున్నాడు (స్వామికి). ఎప్పుడు వాలిపోయినాడో! ఆమె మరలా గిన్నె ఎత్తుకు పోవటానికి గిన్నెలో నీళ్లు అట్లనే ఉన్నాయి. ఎవ్వరూ సేవ చేసే భాగ్యమే రాలేదయ్యా రోసిరెడ్డికి! ఒంటేలు ముంతలో పోసి ఇంతెత్తే గోడ అది. ఇప్పుడు మన పూరిల్లు ఉండలా అక్కడ. ఆ పూరింటికి ఒక రంధ్రం కొట్టినా, గోడకు రంధ్రం! ఈ రంధ్రం గుండా ఈ ముంతలోంచి ఎత్తి అవతల పోసేసే వాడు. కంప అది. ఆ పక్క ఏంటంటే ఒక చిన్న తడిక తాటాకులతో కట్టినాడు దడిలాగా! దొడ్డికకు పోవాలంటే ఆ దడిలోకి పోతాడు. పందులు వచ్చి తినేస్తాయి. అక్కడనే నీళ్లు పెట్టుంటాయి పక్కన. ఆ దడిలోంచి బయటకు వస్తే వాకిట్లోనే పెట్టుంటారు ఒక బిందెడు నీళ్లు కుండలో పోసి. దాంతో కాళ్ళు కడుక్కుంటాడు. శుభ్రం చేసుకుని వస్తాడు. ఆయనకు ఒక్కరవ్వ నీళ్లు అన్నా ఇచ్చే పరిస్థితి లేదు ఎన్నడూ *(అంటే ఏ సేవ చేయించుకోలేదు అని భావం).* ఎందుకు? రూపాయ రూపాయ ఇస్తే ఆ రూపాయ కూడా స్వామికి ఇచ్చేసేవాడు ఇంకొక రూపంలో. అట్లున్నాడు కనుక ఇట్టా చేసాడు. ఈయన (నాగయ్య గారు) పట్టు పంచెలు కట్టకుండా ఉంటే స్వామికి అవమానం కదా అని ఉన్నాడు కనుక అయిదు సవర్ల బంగారు, బ్యాంకులో డబ్బులు ఇవన్నీ హుండీలోకే పోయినాయి. నిన్ను చూసి ఇచ్చినారా? స్వామిని చూసి ఇచ్చినారు. స్వామికి సేవ చేస్తున్నాడని ఇచ్చినారు. ఆస్పత్రిలోనే ఉండాల్సి వచ్చింది బోలెడన్ని రోజులు. మరి ఆయనకి

(రోశిరెడ్డికి) రాలా రోగాలు? రోశిరెడ్డికి రోగం రాలేదా? అని! రోగం రాకుండా చేసినాడు. రోగం రానీయకుండా చేసినాడయ్యా! దాహం కూడా లేదు.

వీళ్లిద్దరి డెత్ అట్లా ఉంటే ఇంకొక ఆవిడ ఉంది. నరసమ్మ! సేవ చేసింది. సేవ చేసింది! ఒక్క రవ్వ అయినా వదిలి పెడితే కదా! కూతురు, అల్లుడు, అల్లుడు పిల్లకాయలు! వదల లేక పోయింది ఆమె. చెపుతూనే ఉంది. అప్పుడు నరసమ్మ చచ్చి పోయింది అన్నాడు. అది మొదలుకొని ఇంటి ధ్యాస లేకుండా పోయింది, కూతురు ధ్యాస లేకుండా పోయింది. కానీ ఈమెకి ఆస్థి ఉంది. చేనుగ చెట్లు ఉన్నాయి. ఆ చేనుగ చెట్లు బాగుండగానే ఈ కూతురుకు కొంత, ఆ కూతురుకు కొంత అని ఇవ్వద్దా! అందుకని నెల్లూరులో ఒక కూతురు ఉంది. ఆ కూతురు వస్తే ఇయ్యాల్సి వచ్చింది. ఆమె వస్తే చేను అవీ ఇచ్చేసింది. చేను అవీ ఆమెకీయకుంటే వెంకయ్య స్వామికి ఇచ్చేస్తే పోలా!

కాదయ్యా రోశిరెడ్డి లాగా పదిరూపాయలు వస్తే పొగాకు తెచ్చి ఆయన కిచ్చినట్లు, నువ్వు తీసుకొచ్చి ఆయనకే ఇచ్చేసే కూడదా అయ్యా! వాళ్ళమ్మాయి మీద ఆధార పడి ఉంది లోపల, వెంకయ్య స్వామి మీద ఆధార పడలేదమ్మా! అందుకు! మంచాన పడ్డది. మంచాన పడితే నేను చెపితినే, అక్కడనే ఒక సీటు బిగించి దాని నుంచి పైప్ వేసి తొట్టి గానీ బోర్లించేస్తే అయ్యిపోద్ది. నేను చేయిస్తాను అంటే వీళ్ళు ఒప్పుకుంటారా అన్నా అంటుంది కూతురు. నాకేమి వచ్చింది. వాళ్ళు ఒప్పుకుంటారా లేదా అనేది నీకెందుకు. బాధ్యత నాది. నేను ఎవరిని అడగాలో వాళ్ళని అడుగుతా చేయిస్తా. నీకు చిమ్మి పోసే వ్యవహారం ఉండదు. రెండు బిందెలు నీళ్లు పోసుకుంటే కూడా అక్కడనే, దాంట్లోకి పోతాయి. రోజుకు రెండు బిందెలు కంటే ఎక్కువ పట్టవు! ఆమెకు ఒక బిందె స్నానానికి. చెయ్యనీయదే! లోపల అక్కడ కనెక్షన్ ఉంది. నా కూతురు, అల్లుడు, అల్లుడు పిల్లలు అనేటటు వంటి కనెక్షన్ ఉంది కనుక ఈయన (స్వామి) మీద లేదు. పూర్తిగా లేదు. సర్వస్య శరణాగతి అంటే రోశిరెడ్డి చేసింది. వీళ్లకీ! నేను మంచం పడితే ఎట్టా? 5 సవర్ల బంగారు. ఆమె మంచాన పడితే ఎట్టా? అంటే కూతురు వచ్చి చెయ్యాలా! లోపల ఉండే దాన్ని బట్టి స్వామి! ఆమె ఉండలా వక్కెమ్మ! వక్కెమ్మకు ఏముంది. ఏం లేదు. చేస్తే నువ్వు చెయ్యి, లేకుంటే లే! చేస్తే వెంకయ్య స్వామి చెయ్యాల ఆమెకు! వెంకయ్య స్వామి ముందే పోయినాడు. ఆ

తర్వాతే వక్కెమ్మ పోయింది. *(వెంకయ్య స్వామి ఇచ్చినా కూడా)* ఒక్క చిండబ్బు తీసుకునేది లేదు ఆవిడ. ఎవరన్నా ఇచ్చినా కానీ నా కొద్దమ్మా నేనేం చేసేదమ్మా! స్వామి హుండీలో వేయండమ్మా అనేది. ఇంకో 10 రోజులకో, 20 రోజులకో చచ్చిపోతుందనంగా వాళ్ళ అన్న కొడుకు వచ్చినాడు ఒకడు. ఎవరన్నా ఇస్తానంటే తీసుకొనెదీనూ, వాడికి ఇచ్చేస్తది. అప్పటిదాకా తీసుకునేది లే! ఏం పోయేకాలం పుట్టిందయ్యా ఇప్పుడు, అందరి దగ్గర డబ్బులు తీసుకుంటోంది అని నాగయ్య అనేవాడు. నీకేమి పోయే రోగం వచ్చింది 5 తులాల బంగారం తీసుకున్నావు. అట్లా ఇస్తూ ఉన్నది. ఆమె చచ్చిపోయే రోజుకి వాళ్లన్న కొడుకు ఇక్కడ లేకుండా వెళ్ళినాడు. వాడు వెళ్ళినాడు అంటే, ఈమెకు కంటి చూపే లేకుండా ఉంది. ఆ పరిస్థితులలో ఎట్ల చెయ్యాలా? ఒంటెలు పోవాలంటే ఆడనే పోసుకుంటుందా? దొడ్డిక పోవాలంటే ఆడ పోద్దా! అక్కడ తలకాయలో ఏమి జిడ్డు ఉండదు వాళ్లకు. సరే వెంకయ్య (నారాయణ అబ్బ ధుని దగ్గర ఉండే అతను) ఆయన పక్కన్నే పడుకొని ఉండాలా రాత్రి పూట. ఆమె ఎప్పుడైనా ఒంటేలు కి పోవాలంటది, దొడ్డికి పోవాలంటది, లేపు! పగలు మాత్రం ఆయన పనులు చూసుకుంటాడు మందిరంలోనూ అవీ ఇవీనూ!

ఒంటేలు పోవాలంటది ఆమెను లేపాలా! లేపిన తర్వాత ఆమే నడిచిపోద్ది కర్రో గిర్రో వేసుకుని! మళ్ళీ ఇక్కడకు తీసుకు వచ్చి కూర్చో బెట్టాల! పెట్టిన తర్వాత ఒంటేలుకి పోయి వచ్చింది. మళ్ళీ పడుకున్నది. ఆ తర్వాత అందరూ చిమ్ముకుంటూ వచ్చి వెంకయ్య, వెంకయ్య అని లేవగొట్టిరి. వెంకయ్య మందిరంలోకి పోవద్దా! ఈమెను చూస్తాడు ఆయన. మరి ఆమె ఏ కోశానా తన వాళ్ళు అనేటటువంటి భావన లేదు కనుక, ఎవ్వరి అవసరం లేకుండానే పోయింది. మరి నువ్వు (నాగయ్యను ఉద్దేశిస్తూ) అందరి దగ్గర తీసుకుంటున్నావు కనుక హాస్పిటల్ చుట్టూ తిరిగి, 5 సవర్ల బంగారం చేయించి, పోస్ట్ ఆఫీస్ లో డబ్బులు వేసి చచ్చిపోయావు.

మరి రోశిరెడ్డి ఎట్టా చచ్చినాడు, వక్కెమ్మ ఎట్టా చచ్చింది, నువ్వెట్టా చచ్చినావు ? వీళ్లిద్దరి కంటే ఇంకా టాప్ వాళ్ళు!

పోలిరెడ్డిని నేను చూడలా! చూసుంటాను కానీ ఈయనే పోలిరెడ్డి అని మాత్రం నాకు తెలియదు. ఉన్నాడంటా అప్పుడు. నువ్వు నాతో మాట్లాడుతున్నావు. అట్లా పోయినావు. మెట్లు దిగి పోవాలా! ఓం ఓం ఓం ఓం.

బాగానే తిరుగుతున్నాడు, ఆయన బాగా తిరుగుతున్నాడు అంటే దొడ్డికి వెళ్తాడు, వస్తాడు. ఇప్పుడు కూడా అంతే పోలిరెడ్డి. ఎవరితోనూ ఏం మాట్లాడడు. స్వామి ఏడ ఉంటే అక్కడ ఆకు కూర కోస్తాడు. ఉడకేసి పెడతాడు. ఉప్పు కారం వేస్తే అది ఆయన కమ్మగా తింటాడు అంట ఆకు. ఛీ ముదనష్టం ఈ ఆకు ఎందుకు అనడు. రోజూ ఆకేనా అనడు. ఎప్పుడూ చింతపండు, ఎర్రగడ్డ, మిరపకాయలు అరల సంచిలో ఉంటుంది. ఎప్పుడూ మెడకు తగులుకుని ఉంటుంది. స్వామి ఏడకు పోతే అక్కడ చేస్తాడు ఈయన. అవన్నీ తీసి ప్లేటులో నలుపుతాడు. మిరప్పొడి, చింతపండు మిరపకాయలు కాల్చేదీను పొయ్యిలోన. అక్కడ పెట్టేసి ఉంటే ఈయన(స్వామి) గంజి త్రాగుతా (అంబలి లాగా చేస్తారు) ఈయన నంజుకుంటుంటాడు. ఆయన (పోలిరెడ్డి) కూడా ఇంతే. పోలిరెడ్డి కూడా ఇట్టనే ఓం ఓం ఓం! నీయమ్మ భడవా ఇల్లు, వాకిలి ఏమీ లేవు.

నేను (సుబ్బరామయ్య తమ గురించి) ఏమై పోతాననే భయం లేదు. ఎవరోనయ్యా వెంకయ్యస్వామి బుద్ధి పుట్టిస్తాడు. ఎవడో చేస్తాడు వచ్చి. నేను ఇప్పుడు పడిపోతే ఎట్టా? నా కొడుకు ఇట్టాంటోడే! ఇంకొక దారం తగిలించేస్తే అమ్మాయిని.

ప్రసాద్ : నేనైతే సార్ ఇప్పుడు ఒకవేళ అక్కడ ఉద్యోగం మానేసి నాగలక్ష్మి ఒప్పుకుంటే ఇక్కడకు వచ్చేస్తే ఎంత బ్యాంకు బాలన్స్ ఉంటే ప్రతి నెలా వస్తుంది? లేకపోతే ఇలా చేస్తే ఎట్లా ఉంటుంది? అంటే ఇక్కడ లెక్చరర్ క్రింద చేరదామా? అంటే ఇంకా ఏదో ఎక్సపెక్టషన్స్ మీట్ అవ్వాలనే తప్ప స్వామి సేవ చేసుకుందామని లేదు సార్!

వెంకటేశ్వర రావు : స్వామి సేవ చేస్తావు మరి మన సెక్యూరిటీ మనం చూసుకుంటాము కదా!

సార్ : అది! మనం సెక్యూరిటీ చూసుకుంటాము ఆయనకు అప్పచెప్పము. (నవ్వులు) అది వచ్చింది!

ప్రసాద్ : చెయ్యకూడదని కాదు సార్! ఆ భావనతో చెయ్యొచ్చు. పోతే పోతుంది అన్నట్టు. ఒక example చెపుతున్నాను సార్. మీరైనా సరే శేషయ్యకు ఇవన్నీ చూసారు కదా! మీరే చెప్పారు కదా రామకృష్ణ పరమహంస, శారదా మాత ఎవరి మీద ఆధార పడకూడదని ఇవన్నీ చేయించారు. భావన ఏముండాలి అంటే

స్వామి చేస్తే చేస్తాడు, లేదా చేయడు అనేది ఉండి మన పనులు మనము చేసుకుంటాము. కరెక్ట్ చెయ్యండి సార్.

సార్ : కరెక్ట్ ఏం చెయ్యబడలా! ఆయన చేస్తాడని నువ్వక్కడ ఉంటే, నీ తపన ఇక్కడ ఉంటే! నీ ఉద్యోగం ఆడనే, తపన ఈడనే! అట్టాంటప్పుడు ఆయనే తీసుకొచ్చి తోస్తాడు. కానీ మనం ఆ రూపాయి వేస్ట్ చేస్తే అన్నం పుట్టదన్నాడే ఆ పాయింట్ ఎప్పుడూ గుర్తు పెట్టుకుని ఉండాలా! నాకు తీపి అంటే ఇష్టము, తీపంటే లగాయిస్తాను, గ్యాస్ ట్రబుల్ తెచ్చుకోవడం అన్నట్టు ఉండకూడదు. అట్టా లేకుండా చేస్తూ ఉంటే ఆయనే చూస్తాడు, తప్పకుండా చూస్తాడు.

ప్రసాద్ : సార్ మీరు ఇంకొకటి చెప్పారు అంటే

సార్ : ఇప్పుడు నాకు 9,600 లేదా 10000 రూపాయలు ఏమో జాస్తి చేసినారు ఈ మధ్య. 10 వేలు వచ్చిందనుకో, నేను ఎంత తింటాను మీరు లెక్కేయండి ఎట్టా అయినా లెక్కేసుకోండయ్యా.

నగేష్: 750 కి మించి ఉండదు సార్

ప్రసాద్ : కూరగాయలు లేవు సార్, గ్రైండర్ ఎన్ని సార్లు వేస్తావు బియ్యం?

నగేష్: ఇప్పుడు వేయట్లేదు. (ప్రక్కనున్న వారి మాటల నుండి) మూడు సార్లు. మూడు సార్లు ఎంత? మూడు కేజీలు.

సార్: 7000 అనుకో

ప్రసాద్: ఎందుకు సార్ 7000, రెండు వేలు సార్! మూడు కేజీల బియ్యం!!

సార్: 1000 రూపాయలు కూడా తింటాననుకో. చెప్పులు బాగు చేయించుకున్నా 100 రూపాయలు, చెప్పులు ఎట్ట వస్తాయి మనకి.

ప్రసాద్: మూడు నెలలు నాలుగు నెలలకి వంద రూపాయలు సార్. 25 రూపాయలు నెలకి.

నగేష్: సార్ కి 6 సంవత్సరాలకైనా చెప్పులు పాడవవు.

సార్:ఇప్పుడు మొన్న సైకిల్ కావాలని అన్నా. పైకి ఎక్కలేకుండా పోయినా! ఎక్కువ సైజు (సైకిల్) ఎక్కినా అనుకో, (ఎత్తు) ఎక్కువగా అనుకో దిగేది ఇబ్బంది! కొంచెం ఏదైనా ఏదన్నా ఇరుకైన ప్లేస్ వచ్చిందనుకో కాళ్లు క్రింద ఆనాల. ఆ సైకిల్ కి అందవు. బొటనవేలి మీద పెట్టాలన్నా కూడా అందవు. దీనికి

అట్లా కాదు, కూర్చొని బ్రేకులు వేసినా కాళ్లు అందుతాయి. తెచ్చుకోవయ్యా డబ్బులు కావాలా, డబ్బులు తెచ్చినాము. ఎప్పుడో కదా కొనింది. 4000 ఆమెకి ఇస్తా. 4000 కి ఇంకో 2000 వేసుకో. 6000 పోతే మిగిలిన 4000 ఏం చేస్తాను. నా దగ్గర ఉండవు ఇకనా! వెంకయ్య స్వామికి సమర్పయామి. కాబట్టి ఇవన్నీ ఎట్లా చేస్తున్నాను. కొంత వాళ్లు వీళ్లు ఇచ్చినది ఉంటే ఉండచ్చు కానీ నా దగ్గర డైరీ ఉంది. నెలకు నాలుగు వేలు వస్తున్నాయి. సంవత్సరానికి 12 X 4,000 = 48000 వస్తాయి. నువ్వు చస్తే ఎట్లా చేస్తావు? నువ్వు మంచాన పడితే ఎట్లా చేస్తావు? నన్ను అడుగుతూ ఉంటారు. నేను ఆ ప్రశ్న వేసుకోను. ఎప్పుడూ నేను మంచాన పడే ఆ ప్రశ్నే వెయ్యడు. లటుక్కున తీసుకుని కూడా పోడా!

వెంకటేశ్వరరావు : రమణయ్య గారు కూడా అంతే కదా!

సార్: ఏ రమణయ్య?

నగేష్: కొమరగిరి రమణయ్య

సార్: కొమరగిరి చచ్చిపోయినప్పుడు పది పదిహేను రోజులు ఋణాను బంధం వల్ల కూతురు దగ్గర ఉన్నాడు. ఇక్కడనే కూతురు. ఇక్కడున్నంత కాలం ఎవరన్నా చేసేవాళ్ళు ఆయనకి. ఎవరి మీద ఆధారపడలేదు. ఆశ్రమం మీద కూడా ఆధార పడలేదు. అన్నం సంస్థానం లో తినడు.

వెంకటేశ్వరరావు: మరి ఎలా?

సార్: ఆయనకి గిన్నె ఉంటుంది ఇంత అల్యూమినియం గిన్నె. ఆ అల్యూమినియం గిన్నె కడిగి ఆడ పెడతాడు. అప్పుడు ఇప్పట్లా కాదు. ఈయన వచ్చినమైనా (ప్రస్తుత E. O.) ఎవరూ అన్నాలు వండకూడదు. ఈడనే తినాలా! అని అన్నారు. అప్పుడు అందరూ ఎవరు పాటికి వండుకుని తినాలా. అంటే వచ్చే విజిటర్స్ రెండు రోజులు మూడు రోజులు నాలుగు రోజులు ఐదు రోజులు పెడతారు కానీ అవతల వస్తే తరిమేస్తారు. వీళ్ళందరూ లాంగ్ స్టాండింగ్ వాళ్ళు ఉంటుండల! 40 రోజులు ఉండాలా, రెండు నెలలు ఉండాల అనే వాళ్ళు బయట రాళ్లు పెట్టుకుని, పొయ్యి పెట్టుకుని కంప తెచ్చుకుని వంట చేసుకుంటూరు ఆ వంట చేసుకున్నవాళ్ళు మొదట అన్నం తీసుకొచ్చి ఈయనకు వేస్తారు ఆ గిన్నెలో. దాంట్లోనే కూర కూడా వేసేస్తారు. వాళ్ళేం చేసుకుంటే అది పచ్చడో, పులుసో, ఏం

పాడో! అది ఆయన తినంగా ఇంకా ఎవరికన్నా పెడతాడు. ఇంత అన్నం అయితే మనకు సరిపోద్ది అనుకుంటే అంత ఉండిచ్చుకుంటాడు. మిగిలినది మొదట్లోనే పెట్టేస్తాడు అందరికీ! ఆయన దగ్గర తినేవాళ్లు కొంతమంది ఉంటారు. అలా తింటూ ఉన్నాడు. లాస్ట్ లో ఏంటంటే ఒక్కొక్క తూరి మోషన్స్ అయ్యేవి. మోషన్స్ అయితే క్రింద అంతా సుబ్రహ్మణ్యం స్వామి పుట్ట దగ్గర కూర్చొని ఉండేవాడు. అప్పుడు అంతగా దేవాలయం కూడా కట్టలా! అక్కడంతా గలీజు అయిపోతే ఎట్ట చెయ్యాలా! అప్పుడు పాపం వచ్చిన వాళ్లే రోజూ అన్నాలు పెడుతుల్లా! వాళ్ళే చిమ్మి, దాన్నంతా శుభ్రం చేసి, ఈయనకి స్నానం చేయించి, ఆ గోచీ గుడ్డ అంతా పిండి, మళ్ళా ఆయనకు కొత్త గోచీ పెట్టి కూర్చొన పెడతారు దేవుడాలా! తరువాత లాస్ట్ లోకి వచ్చేసరికి వాళ్ళ కూతురు వచ్చింది ఒకతూరి తెలిసి, ఇట్లా బాలేకుండా ఉందని. ఆమైన ఏంటంటే నువ్వు రా నాయనా నా తోటి ఇక్కడ ఎందుకు ఉంటావు? అని చెప్పి బలవంతం చేస్తే ఋణానుబంధం ఉన్నట్టుంది పొయ్యినాడు. అక్కడే చనిపోయినాడు. అక్కడే చనిపోతే అన్ని రోజులు ఉన్నాడు కదా ఆయన ఈడనే. ఆయన్ని సమాధి చేస్తామంటే ఒప్పుకోలా!

భక్తుడు: ఎవర్ని సార్?

సార్: ఈ రమణయ్య కూతురు ఇంట్లో చచ్చిపోయాడు ఇక్కడనే యానాది సంఘం అని ఉంది. ఆయనని ఇక్కడ సమాధి ఇక్కడ చేస్తామని ఆయన తమ్ముళ్ళోళ్ళు అడగటానికి వచ్చినారు.

కార్తీక్: అప్పుడు కమిటీ లేదు కదా సార్!

సార్: కమిటీ ఎందుకు లేదు. ఉంది. చచ్చిన కమిటీ అది, బ్రతికిన కమిటీ కాదు! దొంగ నాకొడుకులు అందరూ! వాళ్లందరిలోకి మెయిన్ వీడొకడు బుజ్జిగాడు. ఇప్పుడు చచ్చినాడు. వాడ్ని అడిగితే ఇక్కడ చెయ్యటానికి లేదు పొమ్మన్నాడు. ఇవన్నీ లెక్క వ్రాయకుండా ఉండడు. వ్రాసున్నాడు వెంకయ్య స్వామి. వెంకయ్య స్వామి లెక్క వ్రాస్తాడు. ఆయనకి (బుజ్జయ్యకి) ఎందువల్ల మనస్సులో కష్టము?

ఈడ ఉండమంటే ఉండలేదే. ఇక్కడ ఉండమంటే నువ్వు గమ్మున ఇక్కడ కూర్చొని ఉండు ఆ స్టోర్ రూమ్ దగ్గర. ఎవరు లోపలికి పోతున్నారు, ఎవరు బయటకి వస్తున్నారు. ఈ ఊరి వాళ్లందరనూ పొయ్యేదేనూ, కొబ్బరి చిప్ప ఎత్తుకుని పొయ్యేది. అక్కడ బెల్లం కానీ కనపడితే ఒక బెల్లం గడ్డ ఎత్తుకుని

పోతారు. నీయబ్బదంట్రా అంటారు వాళ్ళు. అక్కడ ఉండే పెద్ద పెద్ద నా కొడుకులు నీ యబ్బదంట్రా అని అడుగుతారు. నువ్వు వాళ్ళనేం అనొద్దు. ఫలానా వాడు వచ్చినాడు పోయినాడు, ఫలానా వాడు వచ్చినాడు పోయినాడు అని నాకు చెప్పు అని అంటాడు ఆది నారాయణ రెడ్డి. (పోలీసు కేసు పెడతాను వాళ్ళను పట్టుకుంటాను అని). ఆయన (రమణయ్య) అంటాడు నాకెందుకొచ్చింది పెంట? మీరు తెచ్చుకోండి, మీరు తాళం వేసుకోండి. రూమ్ ఓపెన్ చేయటం ఎందుకు? తాళం వేసుకో. నేనెందుకు కాపలా ఉండాలి నీకు? అని ఉండేవాడు కాదు. అందుకని ఈ సెక్రటరీకి కోపం. మేము ఉండమంటే ఉండలేదు అని. అందుకని సమాధే చెయ్యకూడదు అన్నాడు. సరే! ఈ రమణయ్యకు ముందు పోయినాడు ఒకడు. దక్షాది రమణయ్య. అవధూత లీలలో ఉంది. ఏముందో ఆయన సంగతి చెప్పు.

ప్రసాద్: గుర్తు లేదు సార్!

సార్ (నవ్వుతూ): దక్షాది రమణయ్యే గొంతు పట్టుకుని కొరికింది రోశిరెడ్డి

నగేష్ : ఆ రమణయ్యను రోశిరెడ్డి కొరికింది?

సార్ : కొరకలా! గోరు ఇక్కడెక్కడో దిగబడింది పట్టుకోవటం తటక్కున. అదీ వెంకయ్య స్వామి చెపితే! లేకపోతే ఆయన తిరగబడడు. ఆయన అమ్మలక్కలు తిడుతుంటే ఏమైనా మంచి చెడ్డలు ఉంటే మాట ఉంటే మాట్లాడుకోవాలి కదోయ్ అంటాడు. అది గ్రీన్ సిగ్నల్ అయ్యింది. ఆ! అని తలపడ్డాడు. వాడి దగ్గర మొండి గొడ్డలి ఎత్తుకుని ఉన్నాడు వాడు. చేతులతో వాడికి ఎక్కడో ఏదో గుచ్చుకునింది. ఆయన (రోసిరెడ్డి) గోళ్ళు తీసుకోడు. అలా గుచ్చుకున్నందు వలన రక్తం అంతా పంచెకి అయ్యింది. పూసుకొని ఊర్లోకి వెళ్ళి చెప్పినాడు. ఊర్లో అతనికి చుట్టాలు ఉన్నారు. హేయ్ ఎంత అయితే మాత్రం, దుర్మార్గుడు అయితే మాత్రం కొడతాడా ఇంత రక్తం వచ్చేటట్లు ? తరిమెయ్యాలి ఇక్కడ నుంచి అంటారు. వాళ్ళందరూ ఇప్పుడు ఉండే సమాధి మందిరం దగ్గర. చెట్లు ఉన్నాయి అప్పుడు బాగా. మొన్న కూడా చింత చెట్టు కొట్టేశారు. ఆ చింత చెట్టు క్రింద కూర్చుని యవ్వారం చేసినారు. ఎవరు చెప్పాలి ఏమని చెప్పాలి స్వామికి అని. ఆ పైన ఎంతోసేపు మాట్లాడుకుని స్వామి దగ్గరకు పోయినారు.

కార్తీక్ : అప్పుడు స్వామి అంటే వారందరికీ భయం ఉందా సార్?

సార్: ఎవరికి?

కార్తీక్ : అక్కడ కూర్చున్న వాళ్లందరికీ

సార్ : వాళ్లకేం భయమయ్యా స్వామంటే! మా ఇంటికి వచ్చి అడుక్కు తినేవాడైతేను.

కార్తీక్ : అంటే అంతకు ముందు వెళ్లి చెట్ల క్రింద కూర్చొని ఎలా చెప్పాలని ఆలోచించుకుంటున్నారంటే

సార్: ఆలోచించుకుంటున్నారంటే ఆ పైనే వెళ్లి చెపుతారేంటి? యోగశక్తి లేదా ఆయనకి! ఆయన యోగశక్తి లేకుండా ఉంటే పైన పడి కొట్టరా వీళ్లంతా? వాళ్ళకేమి లెక్క లే! లెక్కలేక పోయినా రాలేరు దగ్గరకి. అర్ధమౌతోందా? వాళ్ళకేమి లెక్కలేదు. పొయ్యినారు పోవటానికి. కానీ ఆడికి రానీడు ఆయన. తన యోగశక్తి చేత ఆడ కూలబెట్టినాడు. కంటేపల్లి వాళ్ళు కొట్టాలని వస్తే, వాళ్ళ (స్వామి సేవకుల గొడ్డలి) దెబ్బ వినపడే సరికి వీళ్లకు కాళ్ళు చప్పబడిపోయినాయి. వాళ్ళ గొడ్డలి దెబ్బ వినబడే డిస్టెన్స్ లో వీళ్ళ కాళ్ళు చప్పబడిపోయినాయి. ఆడకి పోయినారు. కట్టెలన్నీ బండి కేసినారు. వాళ్ళే తీసకొచ్చి వదిలి పెట్టినారు. అంత అమ్మలక్క తిడుతున్నటు వంటి కంటేపల్లి వాళ్ళు. అట్లాంటిది ఆయన యోగశక్తి. అక్కడికెళ్లి చెప్పాలనుకున్న వాళ్ళు పోయి చెప్పినారు అందరూ. అక్కడుండే వాళ్లందరినీ చెప్పనిచ్చినాడు. ఈయనేమీ పలకలా! అందరినీ! వచ్చినవాడు ఒక్కడు పోకుండా వాడి వాడి సంభాషణ చెప్పినాడు. అన్నీ విన్నమైనా "**అయ్యా! ఒకడ్ని పొమ్మని కంటే మనమే పోతే మంచిది కదా!**" [నగేష్ : ఒక్క మాటతో] ఇంకేముంది! స్వామే వెళతాడంటా, మనమేం లాభం లేదురా! అందరూ లేచి వస్తారు. వాడు చచ్చిపోయినాడు. ఇక్కడ నుండి ఆ ఇన్సిడెంట్ తో హిమాలయాలకు వెళ్ళాడు. శివానంద స్వామి ఉండలా, ఆయన ఆశ్రమానికి వెళ్ళాడు. ఎన్నిరోజులు పట్టిందో ఏం పాడో! దొంగ రైలు ఎక్కి పోవటం! ఆడికి పోయిన తర్వాత ఆరు నెలలు ఉన్నాడో, మూడు నెలలు ఉన్నాడో ఆడా ఊడగొట్టుకున్నాడు. ఇట్లాంటి ఎక్స్ట్రాసు ఉన్నవాళ్లను ఎక్కడ పెట్టుకోరు! నేను వెంకయ్య స్వామి దర్శించినాను, సేవలు చేసినాను అంటే. అక్కడి నుండి మరల ఊడకొచ్చినాడు.

[మధ్యలో అమ్మగారు (సార్ ధర్మ పత్ని) నువ్వు మళ్ళీ పోబల్లా అంటే ]
సార్: ఆ! పోతున్నా! ఆమైన ఆయన ఇక్కడికి వచ్చేసరికి అవధూతలీల రిలీజ్

అయి ఉంది. రిలీజ్ అయినామైన స్వామి చరిత్ర అని చెప్పి చదివించుకున్నాడు అంతా. అంత మందిరంలో తీర్థం వేస్తుంటే అయ్యా సుబ్బరామయ్య అంటే నువ్వేనా అన్నాడు. నేనేనయ్యా అన్నాను. ఆ పుస్తకం రాసినావు, భలే రాసినావయ్యా! అని వెళ్లిపోయాడు. నాకు అనుమానం వచ్చింది. పుస్తకం రాసింది నువ్వేనా, సుబ్బరామయ్య? అని కన్ఫమ్ చేసుకొని పుస్తకం బాగా వ్రాసినవి అని గమ్మున పోయినాడు. ఆయన పోయినామైన ఆయనే కదయ్యా దక్షాది రమణయ్య అని పక్కన ఉన్న యానాది వెంకయ్య అన్నాడు. ఓరి నీ అమ్మ బడవా! చదివే ఉంటాడు అని అనుకున్నాను. సరే డైలీ నాతో ఏం మాట్లాడలేదు. వాడిక మాట్లాడలేదు. ఆమైన 10 రోజులు ఉన్నాక చుట్టుప్రక్కల వాళ్ళకి ఖాతా వాళ్ళు ఉంటారు అక్కడికి పోయి వచ్చినాడు. అక్కడికి పోయి వచ్చాక అనారోగ్యం పడ్డాడు. పెరాలసిస్ వచ్చింది. పెరాలసిస్ వచ్చి పెద్ద ఆసుపత్రిలోనే చచ్చిపోయాడు. మరి పెద్ద ఆస్పత్రిలో చచ్చిపోయాడు అని చెప్పి తెలిసింది. ఆస్పత్రి నుండి ఆ డెడ్ బాడీని ఈడకు తీసుకొచ్చి సమాధి చేయాల్నా, ఇంటికి పంపించాలా అని! ఏమి చేయాలి?

ప్రసాద్: ఇంటికి పంపించాలి. స్వామితో సంబంధం లేదు కదా!

సార్: అప్పుడు చీటీ పెట్టినాడు దొంగ నా --- తప్పుడు మాటలు వస్తున్నాయి.

నగేష్: కొమరగిరి రమణయ్యకు చీటీ పెట్టలేదు కదా

సార్: కొమరగిరి రమణయ్య విషయంలో నువ్వెందుకు చీటీ ఎందుకు పెట్టలేదు? ఆయన (దక్షాది రమణయ్య) విషయంలో నీ కులస్తుడని చీట్లు పెడితివి. ఆయన వెంకయ్య స్వామి ధర్మపరుడు కాబట్టి ఇంటికే పంపించినాడు. చీట్లు పెడితే ఇంటికి పంపించమంటావా ఆయన శరీరాన్ని, సమాధి చేయమంటావా అని చీట్లు పెడితే ఇంటికి పంపించేయ్ మన్నాడు. మరి ఈయనకి కూడా సమాధి మీద చీట్లు పెట్టవచ్చు కదా!

ప్రసాద్: కానీ మనసులో నా మాట కాదన్నాడు కాబట్టి నేను చేయను!

సార్: అదే! నీవు ఉండలేదు కదా చివరి వరకు! చివరి వరకు ఈడ ఉండిచ్చినా నువ్వు బయట ఉన్నావు కానీ మా సంస్థానంలో ఉన్నావా అని అనడా! నువ్వు మా అన్నం తినలేదు కదా అని అంటాడు. అది నిర్వాకం!

నగేష్: మరి అతని పుణ్యం ఏమీ అతన్ని ఇక్కడకు రప్పించేటట్టు చేయలేదా అతను పుణ్యము?

సార్: ఉన్నది పుణ్యం ఉంటే ఏమని? అంటే ఇక్కడ సమాధి చేయాలనా? అంటే ఇక్కడ సమాధి చేసిన వాళ్లందరూ పుణ్యం చేసిన వాళ్లనా? ఇక్కడ సమాధి చేయని వాళ్ళు పుణ్యం చేయని వాళ్ళని పుణ్యం లేని వాళ్ళనా! రేపు నన్ను చేయరు నేను పంగుమాలిన వాడిని (నవ్వులు) అదేం? మిలారేపా చరిత్ర చదవలా! **"మీరే స్తూపాలు కట్టొద్దు. నేను తపస్సు చేసిన చోట ఒక మందిరం కడతారు. ఇరేకొకచోట ఒక మందిరం కడతారు. ఆ మందిరాలు, మీరు పెట్టే ఆ స్తూపాలు లోపల పెట్టే అస్థికలు ఏమీ చేయవు. మీకు లాభం లేదు, నాకు లాభం లేదు**." ఉండలా ఆ మాట. ఉంది (అని అక్కడున్న భక్తులను చూస్తూ) గుర్తు చేసుకుంటున్నాడు. మిలారేపా చరిత్ర చదివితే ఏముందయ్యా. ఆ మిలారేపా చరిత్ర అదే చెబుతాడు. నేను తపస్సు చేసిన చోట నా అస్థికలు తీసుకెళ్లి ఎక్కడెక్కడో దేవాలయాలు కట్టి, దేవాలయాలు కడితే మీకు లాభం లేదు నాకు లాభం లేదు. **మరి ఏం చేస్తే లాభం? నేను చెప్పిన మాటలు ఆచరిస్తే లాభం!** అందుకే ఆయన ఆచరించినాడు. అది ఆయనకు లాభం! ఆయన సమాధి లేక పోయినందున ఆయన ఏమీ పనికిమాలిన వాడేం కాదు. చిట్టచివరి వరకు ఇక్కడే ఉన్నాడే బిక్ష కూడు తింటా. నాకెవరు? నన్ను చూసే వాళ్ళు ఎవరు అని తన కూతురు కూడా కబురు పంపలేదు. కూతురు ఇక్కడికి దగ్గరలోనే ఉంది. చెప్పిన వాడే కాదు. తర్వాత ఎవరో చెబితే ఆమె వచ్చింది.

రా నాయనా అని ఏడిస్తే అప్పుడు సరే అని పోయినాడు. స్తూపాలు కట్టినందు వలన సమాధులు కట్టినందు వలన నైవేద్యాలు పెట్టినందు వలన ఏమీ రాదు.
ప్రసాద్ : సార్ మీరు ఇంకొక మాట అన్నారు సార్. నేను పక్కనుండి వస్తున్నానేమో, ముందర విన్నపం చెప్పేస్తాను సార్. మీరు ఒక సత్సంగంలో మనం స్వామి సేవ టాపుగా చేయాలనే రెడీనెస్ ఉండాలయ్యా! మిగిలినవన్నీ స్వామి చేస్తాడు అని చెప్పారు సార్. అదేమో తెలియదు కానీ స్వామి దగ్గర ఏదైనా పని చేయాలంటే చేయాలనిపిస్తుంది సార్. అందువలన అదొక్కటే పెట్టుకోండి సార్ మీ మనసులో! మిగిలినవన్నీ తీపి తినకూడదు ఇన్ని లాజిక్కులు పెట్టి ఆ ఇవాళ స్వామికి ఇది చేసాము.

సార్: ఏమి తినకుండా ఉంటే?

ప్రసాద్: చేయించండి సార్

సార్: నీవు తింటూ ఉంటే నేనేం చేసేది?

ప్రసాద్: నేను ఖర్జూరాలు ఎలా తినేవాడిని. అర కేజీ ఖర్జూరం అర్థ రాత్రి పూట తినేవాడిని సార్! ఒక వారం రెండు వారాలులో అయిపోయింది. ఫినిష్ చేశారు. ఇప్పుడు తినాలని లేదు సార్!

సార్: నాలుకను చంపాలి నీవు! తీపు అంటే ఆమైన తినేస్తవి! మనము ఉండాల్సిన జాగ్రత్తలో ఉండాలా! ఆయన చెప్పినట్టు వంటి క్రైటీరియాని "జితే జిహ్వా సర్వం జితే" అంటాడే! జిత్తు అంటే గెలవటం, నాలుకను జయిస్తే సర్వం జయించినట్లే! నువ్వేమైనా గెలిచినావా అంటే నేను గెలవలా! అందుకనే చెప్తున్నా నీకు! నేను కూడా ఇప్పుడు నువ్వు చెప్పినట్లు బొరుగు గింజలు ఉన్నాయనుకో రెండు గింజలైనా తింటా!

కార్తీక్: మీరు ఎప్పుడో గెలిచారు కదా!

సార్: అని నువ్వు అనుకుంటే ఎట్టా? నువ్వు అనుకుంటే ఎట్టా? అని నేను చెప్పద్దా! బొరుగు గింజ కనపడితే విసిరి పారెయ్యాలా! నిన్న వేణుగోపాల్ భార్య తిరుపతికి పోయి వచ్చినామని లడ్డు తెచ్చి ఇచ్చింది తిరుపతి లడ్డు! ఆ లడ్డు తీసుకుని ఇట్టా ఇట్టా ఇట్టా తిప్పినా! కాగితం ఉంటుంది, మెరుపు కాగితం పట్టుకుని ఉంటుంది. ఎందుకు? ఎక్కడైనా ఏమైనా మనం తినేది ఏదైనా!

నగేష్: అంటే ఆయిల్ తగలకుండా ఉంటే

సార్: ఆయిల్ కాదు జీడిపప్పు ఉంటే లడ్డు మీద. జీడిపప్పు తీసి ఇలా నోట్లో వేసుకున్నాను. మా ఆవిడ తిడతానే ఉంది.

ప్రసాద్: సార్ మీరు ఎన్ని చెప్పినా...! అంటే మీకు ఎదురు చెప్పకూడదు సార్.

సార్: సరేలే!

ప్రసాద్: దర్గా స్వామి ఒక మాట చెప్పారు సార్! మిమ్మల్ని చూపించి జిహ్వాను జయించాడు అని చెప్పారు.

సార్: అయ్యో!

ప్రసాద్: నాకు శివ చెప్పాడు సార్! ఇంకా మాకు మీరు ఎన్ని చెప్పినా మాకు దర్గాస్వామి చెప్పిందే వేదం సార్. మీరు తిన్నారా అంటే మేము జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు సార్!

సార్: నేను కూడా తినకుండా ఉండను. తింటుంటా! ఇట్లా తినేది, ఏదన్నా రోగం తెచ్చుకునేది!

ప్రసాద్: సాయి ఇంకొకటి చెప్పాడు సార్! సాయి ఏదన్నా చెప్పాడనుకోండి సార్ తీపి ఎక్కువ తింటున్నాను, ఇంకొకటి ఎక్కువ చేస్తున్నాను అని చెపితే అప్పటి నుండి సాయికి తగ్గుతుంది. మీరు ఎక్కువ తింటూ కనబడుతుంటారు సార్! అంటే అలా తీసేస్తూ ఉంటారు సార్, అని చెప్పాడు సార్.

సార్ : అతను ఎట్టా అన్న చెప్పని! Comparative study లో నాగయ్య, రోశిరెడ్డి, వక్కెమ్మ, నరసమ్మ, అయన ఉన్నాడు చూడు పోలి రెడ్డి.

కార్తీక్: సార్! ఆది నారాయణ రెడ్డి సార్?

సార్ : ఆది నారాయణ రెడ్డి దీంట్లోకి ఎందుకు వస్తాడు? ఆయనొక పెద్ద హీరో.

నగేష్: లాస్ట్ లో వచ్చాడు కదా సార్?

సార్: లాస్ట్ లో రానీ, ముందు రానీ ఆయన ఇందులోకి రానీయం Comparative స్టడిలో! తులసమ్మ వేరే! ఎంత ఉందో ప్రారబ్ధం మంచాన 6 నెలలు ఉంది. అన్ని విషయాలలలోను ఆమె గొప్ప ఆమె, 6 నెలలు మంచాన ఉంది. స్వామి మీద ఆధారపడడంలో ఆమె గొప్పగా ఆధారపడింది. ఎందుకు ఇంటికే ఆమె తిరిగి పోలా! హాస్పిటల్ నుండి వచ్చేసిన తర్వాత మరలా ఇంటి గడపే త్రొక్కలా! ఎప్పుడు డబ్బులు ఈయకుంటే అప్పుడు తిడతా ఉండేది కొడుకుని. ఈ రోజు 500 రూపాయలు ఇచ్చి పోయినాడు అనుకో, రేపు లేదు ఎల్లుండి ఆయన వస్తే డబ్బు ఏయిరా అంటుంది తులసమ్మ. నిన్న గాక మొన్న ఇచ్చిపోతిని గదమ్మా 500/- ఇంతలోనే నేను ఏడ తీసుకొచ్చేది అమ్మ! నేను ఏమన్నా ఎట్టు కొడుతున్ననా అంటాడు. ఎట్టి కొడతావో ఏం పాడో నాకు డబ్బులు లేవు. డబ్బులు కావాలా నువ్వు ఏడైనా తీసి ఇయ్యి అంటుంది. ఏంటయ్యా అంటే ఆంజనేయులు స్వామి గుడి పోతే ఈయన 500/- నోటు ఇచ్చాడనుకో 500/- నోటు వేసేస్తుంది. అది ఆమె పద్ధతి. మిరపకాయలు బస్తా ఈరోజు తెచ్చి ఇచ్చినాడనుకో, ఆ బస్తా సాయంకాలానికి అయిపోద్ది. ఎంత లావు గంప గాని, బుట్టగాని తెస్తే ఆ గంప నిండా చాకలి మూట వేస్తుంది. అంత లావును పెట్టేసేది. మంగలి వాళ్ళు వస్తారు స్వామికి గడ్డం గీసే వాళ్ళు. కొండయ్య పోతాడనుకో! కొండయ్య పొయ్యేటప్పుడు ఖాళీ బుట్ట తీసుకు పోతాడు. అంతే ఆ బుట్టకి పెట్టేస్తుంది. ఆ మూట మిరపకాయలు అయిపోయిన దాకా అందరికీ పెడతది. ఈ

వెంకయ్య అమ్మ కూడా వస్తది. ఆవిడ కూడా పెట్టించుకుంటుంది. ఇంకేమీ? అయిపోయింది. ఆమైనా వెంకయ్యను పిలిచేదీనూ, అయ్యో ఏమి ఒక్క మూతడైన లేవు, అబ్బయ్య లేకుండా చూసి ఆ పిల్లను అడుగు, అంత పెడుతుంది. ఆ మిరపకాయలు ఎత్తుకు రా పో! అని చెప్పేది. ఈయన పోయి ఏమి వెంకయ్య వచ్చినావని అడుగుతాడని తెలుసు. ఆయనకీ అప్పుడే తెలుసు, ఏదో వేసుకు వచ్చినాడని వీడు. ఏమీ లేదు ఊరికేనూ! మాట్లాడి పోదామనీ! సరే పొమ్మంటాడు. ఈయన వాకిట ముందర రచ్చో ఏదో వుంది. అక్కడ కూర్చొని ఉంటాడు. ఆమైనా ఈమె కాడకు వెళ్లి చెపుతుండలా, ఇలా చెప్పింది అత్త అనీ! మొన్నే కదా బస్తా ఇచ్చింది అంటే అమ్మ తలా రవ్వంత పెట్టేసింది. చాకలి వాళ్లకి రవ్వంతా, మంగలి వాళ్లకి రవ్వంత, యానాది వాళ్ళకి రవ్వంత ఇచ్చేసింది ఇంకెక్కడ ఉంటాయమ్మా అని వెంకయ్య చెపితే తులసవ్వ కోడలు సరే అని, అట్టయితే నువ్వు వాకిట్లో ఉండు. ఈ మూట ఎత్తి ఆ గోడ మీద పెట్టు. నువ్వు వాకిట్లో చూస్తూ ఉండాలా! ఆయన వస్తున్నాడా లోపలికి అని! నువ్వు ఉండి రాలేదంటే నేను తోసేస్తాను ఇది .

నగేష్ : ఆవిడ కూడా ధర్మాత్మురాలే సార్!

సార్ : ఆ!! ధర్మాత్మురాలే కదా! మొగుడికి తెలీయకుండా మూటడు మిరపకాయలు ఇవ్వాలంటే ఇస్తారా?

వాళ్లకి 50 ఎకరాల పొలం ఉంది. వొట్టి మిరపకాయలే వేస్తారు. వాళ్లు పోయేది, త్రవ్వేది, నీళ్లు పెట్టేది అవేవీ అంతా లే! మెట్ట మిరపకాయలు. 50 ఎకరాల ఒకటే ప్లాట్ ఉంది. ఆ ప్లాట్ లో గుచ్చి పెట్టేస్తే మరలా కాయలు కోసుకోవటానికి పోవటం! ఈయన కోస్తాడా పెడతాడా? అక్కడున్న వాళ్ళే కోస్తారు. మూటలు కట్టి ట్రాక్టర్ కి కట్టి ఇంట్లో వేస్తారు. అట్లా ఉండే మహానీయుడు. ఆ విధంగా మనం చేయగలమా ధర్మము? చేయలేము. ఆయన 20 కేజీల, 30 కేజీల బియ్యం పెట్టుకుని వస్తే మూడో నిమిషంలో ఖాళీ! ఉండిచ్చదు ఎవరు అడిగితే వాళ్లకు పెట్టేస్తది, మరలా ఏంటంటే నా దగ్గర ఏమీ లేదు, ఏమీ లేదు అంటది. ఆమె ఉద్దేశ్యమేమంటే వాళ్ళు ఎంత ఆకలితో ఉన్నారో, ఆ ఆకలితో ఉండి నా దగ్గరకొచ్చి అడిగినారు. మన దగ్గర ఉన్నాయి కదా

బియ్యము, ఉంటే ఇచ్చెయ్యి! అంత ఇచ్చింది కాబట్టే మూడు జన్మలకి తరగక్కుండా ఉన్నాయి ఆస్తి. ఆ ఊరిలో మొదటి కారు వాళ్ళది.

నగేష్: తులసవ్వదా సార్?

సార్: తులసవ్వది

భక్తుడు: ఏ ఊరు సార్?

సార్: పెనవర్తి

భక్తుడు: వెంకయ్య అంటే ఈ నారాయణ తండ్రేనా సార్!

సార్: ఈ వెంకయ్యే! గుడిలో ఉండే వెంకయ్య. పెనవర్తి ఆయనది.

ఆమైన వెంకయ్యస్వామి ఇక్కడికి వచ్చిన దగ్గరనుంచి ఆయనకు పిచ్చి లేపినాడు కాబట్టి వెంకయ్య స్వామి దగ్గరికి వస్తుండేవాడు. రాకరాక వెంకయ్య స్వామి దగ్గర సెటిల్ అయిపోయినాడు.

భక్తుడు: ఇంత చేసిన తులసమ్మ పడిపోయింది కదా! సార్ మంచం మీద పడింది 6 నెలలు.

సార్: మంచం మీద పడ్డది. ఆమెకి ఎలా ఉందో! పడినా ఇవన్నీ చేస్తోంది. లోపల ఉంటుండ్లయ్యా బంధుప్రీతి పోతుందా? మీ అమ్మకి ఉండలా లోపల (ఆ భక్తుడి తల్లిని ఉద్దేశిస్తూ), నా కూతురు రాలేదే నా కూతురు రాలేదే అని ఉంటుంది. ఎక్కడనో బంధుప్రీతి ఉంటుంది, ఎక్కడనో! ఇంకొకటి కూడా ఉంది స్వామికి చేయటంలో. పెరుగు తెచ్చినామనుకో, ముందర వచ్చిన ముగ్గురు కో నలుగురు కు పెరుగు వేస్తుంది. ఆ తర్వాత ఒక నలుగురు వస్తే ఒక్క రవ్వ నీళ్లు కలిపేది. ఇంకా వస్తే గంజే! ఆ పైన వచ్చిన వాళ్లకి ఒట్టి నీళ్లే! ఈ రోజు ఎంతమంది వస్తారు అని తెలిసి ఉంటే మనం మజ్జిగ తయారు చేయొచ్చు! ఎవరు ఎప్పుడు ఎంతమంది వచ్చేది అనేది తెలియదు. వాళ్ల ప్రాప్తము, వెయ్యి!

నగేష్: అది ధర్మమా? కరెక్టా సార్

సార్: ధర్మమే కదా అది

నగేష్: సార్ వీళ్ళందరూ ఏమీ చదువుకోకుండానే ఇంత ధర్మం ఎలా తెలుసు సార్!

సార్: తెలస్తది! గురుభక్తి ఉంటే తెలస్తది. ఆమెకి గురుభక్తి జాస్తి లేకుండా ఉంటే నీ కిడ్నీ ట్రబుల్ నీవు బ్రతుకుతావు చావవు అన్నమైన ఆయన సేవకి

అంకితం అవుతుందా? ఎవ్వరూ రారు! ఆమె చేసినట్లు మనం చేయలేము, ఆమె నడిచినట్లు మనం నడవలేము. కాళ్లకు ఈ రోజు వరకు కారులో తిరిగా! అంటే స్వామి దగ్గరికి వచ్చే వరకు కార్లో తిరిగేది. ఎప్పుడు కాలు కింద పెట్టి ఎరగదు. అట్టా వరండాలోకి వస్తుంది కారు. పోర్టుకో వుంది. పోర్టుకోలోకి కారు వస్తుంది. ఈమె అక్కడకు వచ్చి చెప్పు లేసుకొని ఆ రవ్వంత దూరం నడిచి కారు ఎక్కద్ధి. ఆ మైనా ఎక్కడక్కడికో పోతుంది తిరగద్ది వస్తది. అట్లా ఉన్నామే ఎంత మృదువైపోయి ఉంటుంది అరికాళ్ళు. వెంకయ్య స్వామి కాడికి వచ్చినామైన మరలా చెప్పులు వేసుకోలేదు. చెప్పులు లేకుండానే గులక రాళ్ళల్లో నడస్తది, ముళ్ళల్లో నడస్తది, ఆ మహా తల్లి!

వెంకటేశ్వరరావు: అప్పటికే ఆమె భర్త చనిపోయారా ?

సార్: ఆ! వెంకయ్య స్వామి దగ్గరకి వచ్చేసరికి చనిపోయి ఉన్నాడు. ఆమెను అరగదీయాల్సిన వరకు అరగదీసాడయ్యా! కర్మని క్షాళన చేయాల్సినంత మటుకు క్షాళన చేశాడు. ఇంకా మిగిలిపోయింది. ఆమెకు ఇంక జన్మ ఉండకూడదు అనుకుని రాబోయే జన్మలోని కర్మను కూడా ఈ జన్మలోనే అనుభవింప చేసేసినాడు.

నగేష్: ఆమె నాకు జన్మ లేదు కానీ వెంకయ్య స్వామి మరల జన్మకు వస్తాడు అని చెప్పింది కదా సార్.

సార్: అదే! నేను రాను ఆయన మాత్రం మరల 80 ఏళ్లకు వస్తాడు అని చెప్పింది.

నగేష్: అంటే కర్మంతా పూర్తిగా తీసేసారా?

సార్: ఊ! ఆరు నెలలు మంచంలో ఉండింది పాపం.

వెంకటేశ్వర్లు: తులసవ్వ ఆమె బంధువులతో ఎవరికో కలలో నేను మరలా జన్మకు రాను అని ఎలా చెప్పింది?

సార్: ఇక నేను జన్మకి వచ్చేది లేదు స్వామి వస్తాడు 80 ఏళ్లకు మరలా

వెంకటేశ్వర్లు: మరలా స్వామి భౌతికంగా వస్తాడు అని!

సార్: మరలా వస్తాడు. ఎక్కడ పుడతాడో ఏం పాడో? ఇప్పటికి నలభై ఏళ్లు అయింది. ఇంక నలభై ఏళ్లకు వస్తాడు ఎక్కడ పుడతాడో ఏమో మనకు తెలియదు.

ఆమె ఆహారం పెట్టటంలో మాత్రం జీవులకు ఆమె కింగే! నేను ఎవరో ఆమెకు తెలియదు. నేను ఎవరో ఆమెకు బొత్తిగా తెలియదు. కాదంటే మా ఊరు వస్తోంది కాబట్టి అందరూ తులసవ్వ తులసవ్వ అని పిలుస్తున్నారు కాబట్టి నాకు తెలుసు. కానీ ఆమె హిస్టరీ, బ్యాక్ గ్రౌండ్ ఏమీ తెలియదు. కానీ నేను పోతే నేను అయ్యవారినని, పాంట్ ఒకటి వేసుకుంటానని, టమాటాలన్నా కోసీయమ్మే ఆ వంకాయలన్న కోసీయమ్మే అని అంటది. చెట్లు వేసి ఉన్నాడు నాగయ్య అంతా పాపం. ఆమెకు ఏం పట్టింది నాకు వంకాయలు కోసి ఇవ్వాలని టమాటాలు కోసి ఇవ్వాలని!

వెంకటేశ్వర్లు: అంటే ఎక్కువ తక్కువ సంబంధం లేకుండా అందరినీ సమానంగా చూసిందా?

సార్: అందరినీ సమానంగా చూడదు. ఆమె దృష్టిలో ధర్మం అంటే ధర్మమే! ముందు వచ్చిన వారు వాళ్ళకి కడుపునిండా పెట్టాల, ఆ తర్వాత వచ్చిన వాళ్ళు కొంచెం నీళ్లు పోయాల! ఆ తర్వాత వచ్చిన వాళ్ళు పచ్చడి వేసి పెట్టాల! అది ఆమెకి. ఇప్పుడు అందరికీ మజ్జిగ చేసి పెట్టిందనుకో ఇప్పుడు ఎవరు రాలా మజ్జిగ క్రింద పోయొద్దా పులిసిపోయి అది. మూడు సొరకాయలు తెస్తే కూర చేసింది, ఒకే రోజు మూడు సొరకాయలు చేస్తుంది. ఏందమ్మా! రేపటికి ఒకటన్న ఉండించకూడదా అంటే తిననీ అబ్బాయా అబ్బిడి నిండా తింటారు! అబ్బిడి అంటే అపేక్ష. ఆపేక్షగా తింటారు అన్నమాట. వాళ్లకి ఎప్పుడు పచ్చడి, ఒక్కొక్క రోజు ఏమీ దొరక్కపోతే నీళ్లు వేసుకుని తినేవాళ్లు కదా! అడవిలోకి పోయినారు. ఆడ వేస్తాడు మంట, ఈయన (స్వామి) ఆడ నుంచి ఎప్పుడు కదులుతారో తెలియదు. ఆమైన ఆ పుల్ల ఈ పుల్ల కలబెట్టి ఏదో ఉడకేస్తారు. గంజి పోసుకుని తినటమే ఆడ! అట్టా నోరు చవి చేసి ఉంటుంది. కూర చేస్తే సొరకాయ కూర తింటారు. ఉత్తిదే తింటారు. నాగయ్య చెప్పినాడు మనకు తెలియదు. వంకాయలు అమ్మే ఆవిడ వచ్చింది అనుకో! ఊర్లోకి మొదలు అది! ఆశ్రమం! ఈ లోపల అంతా ఎక్కడా అంగళ్ళు లేవు ఏమీ లేవు. ఇక్కడంతా (సార్ ఇంటి దగ్గర) కూడా ఏమీ లేవు నేను చూసినప్పుడు. నెల్లూరుకు పోవాలా! ఈ ఆశ్రమం కాడకు

పోతే ఎవరన్నా తీసుకుంటారేమోనని ఆ వంకాయలు అమ్మే ఆవిడ ఆడికి పోతుంది బుట్టేసుకుని. అక్కడ పోయిన మీదట ఎంత? అంటే పావలా అంటుంది. తులసవ్వ: ఎందుకు? మూడు అణాలకు ఇస్తుంటే! అప్పుడు అణాలు. ఎట్టమ్మా! మేము నెత్తిన పెట్టుకు తిరిగే వాళ్ళం కదమ్మా. మీరు నెల్లూరు ధరలకు అడిగితే ఎట్లమ్మా! తులసవ్వ : మూడు అణాలే! నేను ఈయను ఎక్కువ.

సరే నమ్మా అని క్రిందకి బుట్టను దించుకుంటుంది.

ఇట్టా ఇట్టా ఇట్టా చూస్తుంది వంకాయలను. గిచ్చి ఉంటుంది, వేసుకున్నది. మూడు అణాలు. రెండు మూడు అణాలకు వేసుకుంది అంటే 6 అణాలు. రూపాయి నోటు ఇచ్చేస్తుంది. ఆ వంకాయలు అమ్మే ఆవిడ 'నా దగ్గర చిల్లర యాడుంది అమ్మ ఇప్పుడే కదా అమ్మ వచ్చినా నేను ' అంటుడ్ల

తులసవ్వ: చిల్లర లేదా!... రేపిద్దువులే

నగేష్: మళ్ళీ రారు!

సార్: ఇంక వస్తరా వాళ్లు. పొట్ట ఏడో ఉంది కనబడను కూడా కనబడట్లేదు, తిని పోమని పెడుతుంది. వాళ్ళు ఇద్దరు మనుషుల కూడు తింటారు. ఆ వంకాయల గంప నెత్తి మీద పెట్టుకొని చక్కగా పోతుంది. ఆమైన నాగయ్య అడుగుతాడు పావలా అని చెప్పి అంటే మూడు అణాలకి అడిగితివి, ఇప్పుడు ఆరణాలకు కొంటివి, రూపాయి నోటు ఇస్తివి, ఇంక నీకు వస్తాయా డబ్బులు! ... **తులసవ్వ:** రాకుంటే పోనీ! **నాగయ్య:** మరి కూడు పెడితివే ఆ కూడు ఎంతయింది?

నగేష్: అది ఒక పది రూపాయలు

సార్: ఎంతన్నాగాని ఆమెకి పడతదా! పోనీ పాపం ఆ డొక్కలు భోరున అంటుంటే... అట్లాంటి మహాతల్లి ఆవిడ! అది కాదు. గాది అని ఉంటుంది. వరిగడ్డి వెంటిలాగా పట్టి చుడతారు, గడ్డి పెడతారు మధ్యలో లోపల, గడ్డి చుట్టూ ధాన్యము వేసి పెడతారు. అట్లాంటివి 20, 30 ఉంటాయి వాళ్ళింట్లో గాదిలు... నగేష్: చాలా ఎక్కువ!

సార్ : ఆ! చాలా పెద్ద రైతు! ఎవరన్నా కడుపు కాలిన వాడు వస్తే కొడవలి తెచ్చిస్తుంది. ఏమిలా రెండు వెంటిల మధ్య వేస్తే ఇంత లావు ఉంటుంది. పై వెంటికి

కింద వెంటికి కింద మధ్య దూర్చేసి ఇట్లా కానీ అంటే మధ్య సందు వస్తుంది. కర్రపెట్టి తోసినా పోద్ది! ఆమైనా దాంట్లో నుంచి ఒడ్లు కారుతాయి. ఆ బుట్ట నిండా ఎత్తుకో! మరలా దాన్ని అరెస్టు చెయ్. ఈ రోజుకి చెప్పద్ది, రేపు పైన తీసుకోమని చెప్పద్ధి! తీరా వడ్లు వాళ్లు వచ్చి అమ్ముతుండ్లా , ప్రతి గాదిలో పాతిక పాతిక అయిపోయింది అని అంటే, మొదనష్టపు పందికొక్కులు అన్ని ఉన్నాయా! మీరేమో పొలంకి వెళతారు మేము ఇక్కడ చస్తున్నాము పందికొక్కులతో! అని తులసవ్వ అనేది.

సార్: బంగారు ఇస్తారా ఊరికినే? కమ్మంగా బంగారం ఇవ్వరు! అది ఎవరో మన వాడు ఉంటే తాళిబొట్టు తీసి ఇస్తారు. ఈమె ఎవరు పెళ్లి చేసుకుంటానని చెప్పి వస్తే వాళ్లకు ఒక గాజు ఇచ్చేస్తుంది. ఇంకొకడు వస్తే వాడికి ఇంకో గాజు! అది కూడా లేకుండా ఉంటే మెడలో ఉన్న దండల్లో ఒక దండ తెంచి ఇస్తుంది. నీ అమ్మ భడవా! నీ పెళ్ళాం దగ్గర నగలు ఉన్నాయో లేదో చూసుకో పొమ్మని వాళ్ళ ఆయనకు చెపితే, ఆయన (తులసవ్వ భర్త) అడిగినాడు అనుకో ఎట్టా పోయింది అని. మొన్న పెళ్లికి పోయినానా అక్కడ పిల్లకు వేసినారా మరలా పోయినప్పుడు తెచ్చుకుంటాలే అనేది తులసవ్వ. వట్టిదే! ఇంట్లో ఉన్న నగలు కరిగించి బిస్కెట్లు తయారు చేయించినాడు నగలుగా లేకుండా! అది ఆదినారాయణ చెప్పినాడు.

**---సార్ సద్గోష్ఠి పూర్తి---**

# <u>శ్రీ సుబ్బరామయ్య సార్ సూక్తులు</u>

1. శ్రమతో సేవ - సేవతో కైవల్యం.
2. భగవంతుడు మననుంచి కోరేదేమిటి ? 1. కాలం 2. మనస్సు.
3. పారాయణ, మననం ద్వారా మనలోని రాగ, ద్వేషాలు పలుచబడతాయి.
4. ఎవరి ధర్మాన్ని వారు త్రికరణశుద్ధిగా ఆచరిస్తే వారికి కలిగేదంతా ఆనందమే.

5. మనం లోకాన్ని ఉద్ధరించ గలమా ? మన కర్తవ్యం మనం చేసుకుంటూ పోవాలి.
6. ఇష్టాయిష్టాలు లేకుండా జీవించడం అభ్యసిస్తే ధ్యానం చాలా సులభంగా కుదురుతుంది.
7. నిత్యం సద్గురువు మనకు ఇచ్చిన అనుభవాలు తలచుకొని పులకించే పూజే పూజ.
8. నీకు సద్గురువు తోడు ఉండాలంటే మొదట విమర్శలు, కబుర్లు మానాలి.
9. ఎప్పుడంటే అప్పుడు, ఎవరు పెడితే వారి దగ్గర, ఎంత పడితే అంత, తినటం మానాలి.
10. సద్గురు కృప పొందాలన్న ధ్యేయం ఉంటే వ్యామోహాలు, జిహ్వాచాపల్యాలు అన్నీ పోతాయి.
11. ఆలోచనలన్నీ అహంకారమే !
12. ప్రతీదానికి హృదయపూర్వకమైన ప్రార్థనే సాఫల్యమివ్వగలదు.

**మరుపే మరణం !**